# శిరసిమాలిక

"ఈ ఇంటివారెవరండీ?"

"ఎవరూ?"

"ఈ ఇంటివారు - సొంతదారులు..."

"అది సరేలెండి- మీ రెవరూ అనీ అడగడం...."

"నే నెవరని చెప్పుకోను లెండి! అయినా మీరేనా ఇంటివారు?"

"కాకపోతే మీరెవరో చెప్పరా ఏం?"

"ఎందుకు చెప్పాలో నాకర్థం కావడంలేదు."

"గౌరవంగా ఎవరని అడిగితే ఇంత అర్థాలూ తెలియక పోడాలూ ఎందుకో! పాడుకాలం-"

"నా ఒక్కణ్ణి గురించి కాలాలన్నిటినీ తిట్టేయడం ఎందుకులెండి గాని, ఈ

ఇంటివారు ఎవరూ?"

"తెలీక అడుగుతానూ - వారంటు ఏదైనా తెచ్చావా నాయనా?"

"వారంట్లు తెచ్చే ఉద్యోగం దొరకలేదుగానీ, అసలా సందేహం ఎందుకు వచ్చింది దొడ్డమ్మగారూ?"

"అహా...అసలు నువ్వు ఇంటివారిని ఏజన్మలోనైనా చూశావాఅని?"

" ఈ ఇంటి వారిని నిజంగా చూడలేదు లెండి."

"పోనీ - ఏ ఇంటివారినైనా -"

"చాలామందిని చూసేను."

"అదిగో! అచ్చు అలాగే అంటూఉండేవాడు మా రెండోపిల్ల సవతి కొడుకు మేనమామ...నలభైఏళ్ల నిండాయో లేదో గుటుక్కు మన్నాడు....పాపం. ఆపిల్ల అదృష్టం.'
'

"దురదృష్టం అనండి".

"ఎందుకనాలి? బ్రతికున్నన్నాళ్ళు కాల్చుకుని తిన్నాడు."

"పోనిండి...ఆవిడ అదృష్టవంతురాలు."

"అదృష్టం!...నువ్వెవరోగాని, నువ్వే అనాలి. అయిదుగురు పిల్లల్నీ దాన్నీ లోకానికి వప్పజెప్పి హరీమని ఊరుకున్నాడు."

"ఎంతకష్టం!"

"అదేం మాటయ్యా! సాలీనా పదేనువేలొచ్చే భూములూ పదివేల ఇంసురెంసూ...అన్నీగాక డాబాతోటలో సినిమాలాంటి ఇల్లూ...అన్నీ దానికే వచ్చాయిగా!"

"ఏ సంఘటనకైనా రెండు రకాల ఫలితాలు ఉంటాయి లెండి."

"అన్నావా.... అచ్చం కథలు రాసేవాడిలా అన్నావు. ఐతే నువ్వూ కథలు రాస్తావేమిటి?'
'

"ఏదో - అప్పుడప్పుడు."

"ఇంకేం! అయితే సరేనన్నమాట! మా మూడోవాడి బావమరిది తోడల్లుడూ కథలు రాస్తూనే ఉంటాడులే."

"ఆయనకి చాలాపేరుంది కాబోలు."

"ఉండకేం! సుబ్రహ్మణ్య సోమయాజీ సత్యనారాయణా మూర్తిగారు-పెద్దదే!"

"చాలా పెద్దదే నండి."

"అన్నావా! వాళ్లమామగారి రెండో అల్లుడి ఇల్లు నువ్వుచూస్తే ఆమాట అనవ్. అది మరీ పెద్దది."

"వాటికి సామ్యం ఏమిటి లెండి! వేటి కవే."

"అలా అనకు. ఒక్కొక్కళ్ళకి మహాయోగం ఉంటే అన్నీ పెద్దవే వొస్తాయి...జాతకాలంతే. మా ఆయన ఎప్పుడూ అలాగే అంటూ ఉండేవారు."

"అది నిజమేనేమో లెండి."

"నిజంకాక, అబద్ధం నేనెందుకాడతానయ్యా? నాకు ఆడపిల్లలున్నారంటే, అదిమగాళ్ళాడిన అబద్ధాలు. నేను అక్కడికీ ప్రతిదినం ప్రాయశ్చిత్తం చేసుకుంటూనే ఉండేదాన్ని."

"ఈ ఇంటి...."

"ఆఁ...అసలు సంగతి వొదిలేశాను. ఇంటివాళ్లలా ఉంటారో ఎప్పుడైనా చూశావా అని అడుగుదామనుకుంటూ, ఇన్నిదార్లు పట్టేను...మందమతిని. ఆయన బతికున్నరోజుల్లో ఒక్కపనికూడా ఎన్నడూ తారుమారు చెయ్యలేదు. ఓసారి మా యింటి ప్రక్క పురాణం చెప్పే శాస్త్రులుగారు పతివ్రతకి ఉదాహరణగా...."

"వారిప్పుడు...."

"చచ్చారులెండి. ఇంకా ఎలా ఉంటాడూ?"

"జబ్బు కాబోలు."

"మగాళ్ళందరికీ ఒకటే జబ్బు - త్వరగా చచ్చిపోడం."

"మీరు మరీ అన్యాయంగా మాట్లాడుతున్నారండీ!"

"కొడుకులాటివాడవ్. వెయ్యేళ్ళు బ్రతుకు నాయనా.అంతేగాని., నేను చేసేదీ చెప్పేదీ అన్యాయం అని మాత్రం అనకు. పుణ్యముంటుంది."

"పోనీండి - మీరు చాలా నిజంగా చెప్పేరుగానీ- అలాంటి...."

"అదేమయ్యా! అసలు విషయానికొస్తుంటే అడ్డమైన పెడదారులూ పట్టించి వాగిస్తున్నావు. ఇంటివారికుండే, ఆ గర్వం, దర్పం..."

"మీరు ఈ ఇంటివారనుకుంటాను."

"గర్వం, దర్పం, మావంశంలో పుట్టుకొచ్చాయయ్యా! చూశావా! చక్కగా గ్రహించావు....చాలా చదువుకున్నావా నాయినా?"

"ఇలాటివాటికి చదువులెందుకులెండి."

"నీకడుపు చల్లగా - నిజం చెప్పేవుబాబూ....నువ్వెవరివోగాని....ఎందుకూ చదువూ? మా నాలుగో కోడలు ఇంటరు పేసయిందో లేదో నువ్వెరుగుదువా?"

"నాకెలా తెలుస్తుందండీ."

"ఎలా అనకు- కొన్ని విషయాలు ఎలాగేనా తెలుస్తాయి. ఈ విషయం ఈ వీధి వారందరికీ తెలుసును. అసలు దాన్ని చూడగాన్నే చెప్పెవొచ్చును-అది ఇంటరు పేసవలేదని."

"అలాగేనండి."

"మరి, నీకెలా తెలుసూ?"

"మీరు చెప్తున్నారు కాదా?"

"చెప్తే అంతే?.....ఇంకోగంటపోయాక నువ్వు చాలా మంచివాడివని అందరితోనూ చెప్తాను. అంతే?"

"మనం వాదించటం అనవసరం. ఇంతకీ -"

"ప్లీడరీకిమాత్రం నువ్వు పనికిరావు. మరో పని చూసుకో. అంతేగాని, అనవసరమేమిటి ఈ ప్రపంచంలో?....ప్రతీచెత్తా అవసరమే...అందుకని ఏడేళ్లుదాచమని ఇంగ్లీషులో గోలపెడుతూ వుంటాడు మా పెద్దదాని మొగుడు."

"మిమ్మల్ని ఏడేళ్ళూ తప్పకుండా జ్ఞాపకంలో దాచుకుంటానులెండి."

"బాగుపడతావు...నీ కథల్లో మాత్రం నన్ను రాసేక.... మా కోడళ్ళూ కొడుకులూ అందరూ అవి చదివేవాళ్ళే.... చంపేస్తారు. ఓ రామాయణం భారతం ఎవరికీ అక్కర్లేదు."

"ఈ రోజుల్లో అవెవరికి కావాలిలెండి!"

"అన్నావా?...అమాటే నేనంటే మా వెంకటలక్ష్మీ, మనోహరీ, మాణిక్యం, రాజరత్నం, గోపాలస్వామీ, మోహనుడూ, రామచంద్రమూర్తీ, సత్యం, సరితా, వసూ అందరూ కలిసి నా మీద దండెత్తుతారు."

"కష్టమేనండి."

"అంతకష్టంకాదులే!...నేనూ కొద్ది నిముషాలుండి వాళ్ళతో కలిసిపోతాను. దాంతో ఎక్కడివాళ్ళక్కడ ఖిన్నులై ఊరుకుంటారు."

"ఇంతకీ నేను వొచ్చినపని...."

"చేసుకో నాయనా! చేసుకో!.... చదువుకున్నవాడివి. సంపాయిస్తున్నట్టున్నావు.... అన్నట్టు - ఉద్యోగం ఏంటి బాబూ?"

"జూలాజికల్ స్పెసిమెన్ కలెక్టరు."

"అంతా ఉద్యోగమే?"

"అవునండి."

"మరి అలాగ ఉన్నావేం?"

"నేనసలు ఇంతేనండి."

"బాగు బాగు...ఇంత పెద్ద కలట్రువిగదా! సూటైనా వేసుకోలేదేం నాయనా?"

"ఇవి జాతీయదుస్తులు లెండి."

"మహాబాగు....మా మూడో కుర్రాడికి సెలవు దొరికి ఇవాళ మెయిల్లోవస్తే నిన్ను చూపెట్టి బుద్ధిచెప్తును.... వాడు చేసేది మేష్టరుగిరియే కాని, వేసేసూట్లు మనకందవు!"

"అలాటివి ఎవరియిష్టం వారిదిలెండి"

"సరిగ్గా అన్నావు. మా సౌమిత్రకి కాఫీ స్ట్రాంగ్‌గా ఉండాలి; సరోజకి టీ తప్ప పనికిరాదు...."

"మీ జానకికి..."

"సరే! మా జానకిని నువ్వెరుగుదువన్నమాట."

"అబ్బే, నాకు తెలీదులెండి."

"సిగ్గుపడుతున్నావుగాని, అది తెలీకపోడం ఏవిటి? కథలురాసే అబ్బాయిలంతా తనమీదే రాస్తారని అది అంటే ఏమో అనుకున్నాను. అయినా, దానికేం! రాణీ!...నీకు బాగ తెలుసునన్నమాట!"

"నిజంగా నాకామె ఏమీ తెలీదండీ!"

"మరి దాని పేరు యెలాగ తెలిసిందయ్యా, విచిత్రం?"

"మీరు వర్ణిస్తూన్న పేర్లన్నీ విన్నాక ఆ పేరు ఉండదని అనుకోలేక పోయాను."

"బాగు బాగు! ఏం విడ్డూరం మనుషులూ!"

"ఏదోరకం మనుషులంగానీ - ఈ ఇంటివారు మీరేనా చెప్పండి...గంటనించి అడుగుతున్నాను."

"ఏం అమాయకుడివి బాబూ! అలా అనుకోగూడదు గానీ, కిందటి ఖరసంవత్సరంలో పోయినవాడు తిరిగొస్తాడా ఏమైనానా - సరిగ్గా మా ఛాముండేశ్వరావులాగే మాట్లాడుతున్నావు. వాడు బతికి బాగుంటే-"

"నేను చచ్చి ఉండేవాణ్ని - వెడుతున్నాను."

"అంత అశుభం కోరుకోకు నాయనా!....తథాస్తు దేవతలు తథాస్తు అనేస్తారు. మా మూడోకోడలు పెదతండ్రి తోడ...."

"దొడ్డమ్మగారూ! మీ కోడళ్ళనీ, వారి బంధువుల్నీ, వారి బంధువుల బంధువుల్నీ వొదిలేయండి. నాకు ఓ గది కావాలి. ఈ ఇంట్లో దొరుకుతుందా?"

"పెళ్ళయిందా నాయినా?"

"అయింది."

"అత్తారిదేవూరూ?"

"రాజమండ్రి."

"నియ్యోగులా ఏమిటి?"

"అవును."

"అయితే....అయ్యో! వెళ్ళిపోతున్నావేం?"

"వొద్దుబాబో వొద్దు...నాకిక్కడ వొట్టినే ఇచ్చినా గది వొద్దు."

"అయ్యో .... రాజమండ్రి అయితే, సురవరపువారి..... అదేం పరుగే! అవ్వ!....హవ్వ! ఎంతపరుగూ! వెళ్ళిపోయాడే!".

✧ ✧ ✧